# భారతదేశ ఆర్థికాభివృద్ధి

## సరళీకరణ, ప్రైవేటీకరణ

**భారతదేశంలో 1991 లో ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక సంస్కరణల్లో భాగంగా సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పీజీ) అనే అభివృద్ధి నమూనాను అప్పటి ఆర్థిక మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రారంభించారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు సూచనలు, అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావు చొరవతో ఈ ఎల్‌పీజీ నమూనా ఆవిష్కృతమైంది. 1980వ దశకంలో భారత ప్రభుత్వం అమలు చేసిన స్థూల ఆర్థిక విధానాలు 1991 నాటికి తీవ్ర ఆర్థిక సంక్షోభానికి దారి తీశాయి. 1990 చివర్లో ఏర్పడిన గల్ఫ్ సంక్షోభం మన ఆర్థిక వ్యవస్థను మరింత కుదిపేసింది. విదేశీ మారక నిధుల (FOREX రిజర్వులు) సంక్షోభం దీనికి తోడైంది.**

సరళీకరణ సంస్కరణ దిశను సూచిస్తే, ప్రైవేటీకరణ ఆ సంస్కరణ మూలాన్ని, ప్రపంచీకరణ ఆ సంస్కరణ అంతిమ లక్ష్యాన్ని సూచిస్తాయి. అంతర్జాతీయ వర్తకంలో ప్రభుత్వ నియంత్రణల తొలగింపును సరళీకరణ, ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉప సంహరణతోపాటు ఆర్థిక వ్యవస్థలో అనేక రంగాల్లో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడాన్ని ప్రైవేటీకరణ తెలియజేస్తాయి.

- ✯ ప్రపంచంలో వివిధ ఆర్థిక వ్యవస్థలతో మన ఆర్థిక వ్యవస్థను అనుసంధానం చేయడాన్ని ప్రపంచీకరణ తెలుపుతుంది. ఒక దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషించే అంతర్జాతీయ వ్యాపారంలో సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్ పీజీ) ప్రభావాలు పనిచేసి, ఆ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కావడానికి దోహదం చేస్తాయి.
- ✯ మొదటి, రెండు ప్రపంచ యుద్ధాలు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఫలితంగా ప్రపంచదేశాల మధ్య అంతర్జాతీయ వ్యాపారం క్షీణించింది. దీనికి భారతదేశం కూడా తీవ్రంగా ప్రభావితమైంది. మనదేశ ప్రణాళికాబద్ధ, కేంద్రీకృత ఆర్థిక విధానాలు, 1991 వరకు కేంద్రప్రభుత్వం అనుసరించిన విధానాలు సంక్షోభానికి కారణం అవడంతో ఎల్ పీజీ నమూనా తెరపైకి వచ్చింది.

### ఎల్‌పీజీ నమూనా వ్యవస్థ - మార్పులు

ప్రభుత్వ రంగంలో ప్రవేశానికి ప్రైవేటు రంగానికి ద్వారాలు తెరిచారు. నష్టాలతో నడిచే ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా కోశ లోటును తగ్గించే ప్రయత్నాలు జరిగాయి.

- ✯ ప్రైవేటు పెట్టుబడులకు ప్రధాన అవరోధాలుగా ఉన్న పారిశ్రామిక లైసెన్స్‌లను రద్దు చేయడం ప్రారంభమైంది.
- ✯ ఆర్థిక శక్తి కేంద్రీకరణను నివారించే ఉద్దేశంతో ఏర్పాటైన ఎంఆర్‌టీపీ కమిషన్‌ను రద్దు చేస్తూ పెద్ద వ్యాపార గ్రూపులకు అవరోధంగా ఉన్న పెట్టుబడి పరిమితులను తొలగించారు.
- ✯ అత్యధిక ప్రాధాన్య రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 51% వరకు అనుమతించారు. విదేశీ సాంకేతిక పరిజ్ఞానం, నిపుణులను దేశంలోకి అనుమతిస్తూ తగిన చర్యలను చేపట్టారు.
- ✯ ఖాయిలా పరిశ్రమలను పారిశ్రామిక, ఆర్థిక పునర్నిర్మాణ బోర్డుకు నివేదించేట్లు చేసి, వాటిలో పనిచేసే కార్మికులకు తగిన పరిహార ప్యాకేజీలను అందించడానికి చర్యలను చేపట్టారు.
- ✯ ప్రభుత్వరంగ సంస్థలకు స్వయం ప్రతిపత్తిని కల్పించడానికి తగిన చర్యలను చేపట్టారు.
- ✯ ఎగుమతులను ప్రోత్సహించడానికి విదేశాలకు ద్వారాలు తెరిచారు. విదేశీ మూలధనం, సాంకేతిక పరిజ్ఞానాలను దేశంలోకి దిగుమతి చేసుకోవడానికి దిగుమతి సుంకాలను తగ్గించి, వాటి అడ్డంకులను తొలగించారు.
- ✯ ప్రైవేటు రంగాన్ని అన్నింటా ప్రోత్సహిస్తూ వారికి పెద్దపీట వేశారు.
- ✯ దేశంలో ఎగుమతి ప్రధాన, దిగుమతి ప్రత్యామ్నాయ వస్తువులను ఉత్పత్తి చేసే సంస్థలను ప్రోత్సహించడం ప్రారంభమైంది.

### సరళీకరణ

19వ శతాబ్దం ప్రథమార్ధంలో ప్రాచుర్యం పొందిన ఉదారవాదం (లిబరలిజం) అనే భావజాలం నుంచి సరళీకరణ ఉద్భవించిందని చెప్పవచ్చు.

- ✯ ముఖ్యంగా ఇది ఫ్యూడలిజాన్ని అంతమొందిస్తూ, మార్కెట్, పెట్టుబడిదారీ ఆర్థిక విధానాల వృద్ధికి కారణమైన ఆడమ్ స్మిత్ 'Laissez- faire' (జోక్యం చేసుకోకు) విధానానికి అనుగుణంగా రూపొందింది.



R-31-12-16

www.eenadupratibha.net

★ సరళీకరణవాదులు ప్రధానంగా మార్కెట్ అనుకూల, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ విధానాలను ప్రోత్సహిస్తారు. దీని ఫలితంగా 1980 దశకంలో అమెరికా, యూరప్, చైనాల్లో 'ఓపెన్ డోర్ పాలసీ' అభివృద్ధి చెందింది.

★ భారత ఆర్థిక వ్యవస్థలో మితిమీరిన నియంత్రణలను సరళీకరిస్తూ, వ్యవస్థలో ప్రభుత్వ జోక్యాన్ని తగ్గిస్తూ, మార్కెట్ శక్తులకు ఇచ్చే స్వేచ్ఛనే సరళీకరణగా పేర్కొనవచ్చు.

★ ఈ సరళీకరణ అమల్లో భాగంగా 1991 నూతన పారిశ్రామిక విధాన తీర్మానం ద్వారా ప్రభుత్వ రంగానికి రిజర్వు చేసిన 18 పరిశ్రమలను 3 పరిశ్రమలకు కుదించారు. అంటే, ప్రభుత్వ రంగానికి రక్షణ సామగ్రి, రైల్వే రవాణా, అణు విద్యుదుత్పత్తిని కేటాయించారు.

★ అలాగే తప్పనిసరిగా లైసెన్స్ పొందాల్సిన 5 పరిశ్రమలకు తప్ప మిగిలిన అన్ని పరిశ్రమలను (10 లక్షల జనాభా కంటే మించిన ప్రాంతాలు తప్ప) అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా స్థాపించుకోవచ్చు.

★ అంతర్జాతీయ వర్తకంలో దశల వారీగా వివిధ రకాలైన దిగుమతి సుంకాలు, నియంత్రణలను తొలగించడం సరళీకరణలో భాగమే.

★ బ్యాంకులు, టెలికాం, బీమా, విమానయానం తప్ప అనేక పరిశ్రమల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 100% వరకు అనుమతిస్తున్నారు.

★ విదేశీ సాంకేతిక పరిజ్ఞానం, ఒప్పందాలను అధిక ప్రాధాన్య రంగాల్లో అనుమతిస్తున్నారు.

★ ప్రభుత్వరంగ పాత్రను పరిమితం చేస్తూ, వివిధ పారిశ్రామిక విధాన తీర్మానాలు, తర్వాత చర్చల ద్వారా ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని సరళీకరణలో భాగంగా ప్రోత్సహిస్తున్నారు.

## ప్రైవేటీకరణ

ప్రైవేటీకరణ అనే పదాన్ని 1969 లో ప్రొఫెసర్ పీటర్ డ్రకర్ 'ద ఏజ్ ఆఫ్ డిస్‌కంటిన్యుటీ' అనే పుస్తకంలో మొదటిసారి ప్రస్తావించారు.

★ 1980లో బ్రిటన్‌లో మార్గరెట్ థాచర్ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేసే ప్రక్రియను చేపట్టడంతో ప్రైవేటీకరణ ఊపందుకుంది.

★ ప్రజల జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే కార్యకలాపాల నుంచి ప్రభుత్వం వైదొలగి, మార్కెట్ వ్యవస్థను పటిష్ఠం చేయడాన్నే ప్రైవేటీకరణ అనవచ్చు.

★ బ్రిటన్ ప్రభుత్వం చేపట్టిన చర్యల పర్యవసానంగా ప్రపంచంలోని వివిధ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థల్లో ప్రభుత్వ సంస్థల యాజమాన్యం, ఆస్తులతోపాటు నిర్వహణ భారాన్ని ప్రైవేటుపరం చేయడం మొదలైంది.

★ 1990 తర్వాత రష్యా, తూర్పు యూరప్ దేశాల్లో సామ్యవాద వ్యవస్థ పతనం, చైనా చేపట్టిన మార్కెట్ సామ్యవాదం ప్రైవేటీకరణకు మరింత బలాన్ని చేకూర్చింది.

★ 1992 లో ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) దేశాలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయటం అభివృద్ధి చెందుతున్న దేశాలకు మార్గదర్శకమైంది.

★ ప్రైవేటీకరణను ఒక రకంగా డీ నేషనలైజేషన్ అనవచ్చు.

★ ప్రపంచంలో వివిధ ప్రభుత్వాల ఆర్థిక సంక్షోభాలను చక్కదిద్దడానికి స్వల్పకాల పరిష్కారంగా ప్రైవేటీకరణను ప్రారంభిస్తున్నారు.

★ భారత్‌లో 1980 లో కొన్ని రంగాల్లో ప్రైవేటీకరణను చేపట్టినా, 1984 లో నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ మొదటగా ఈ అంశాన్ని ప్రస్తావించారు.

★ ఈ దిశగా 1991 లో ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక సంస్కరణలు ప్రైవేటీకరణ విస్తరణకు మార్గాన్ని చూపాయి.

★ మనదేశంలో లైసెన్స్‌లు ఎత్తివేయడం, పరిశ్రమల కేటాయింపులను తొలగించడం (డీరిజర్వేషన్), సబ్సిడీల కోత, విదేశీ పెట్టుబడుల ఆహ్వానం లాంటివన్నింటినీ ప్రైవేటీకరణలో భాగంగా ప్రారంభించారు.

★ భారత ప్రభుత్వం 30 కి పైగా ప్రభుత్వరంగ సంస్థల 20% ఈక్విటీ మూలధనాన్ని మ్యూచువల్ ఫండ్స్‌కు, విత్తసంస్థలకు, ప్రజలకు, ఉద్యోగస్థులకు అమ్మకానికి పెట్టడం ద్వారా ప్రైవేటీకరణకు నాంది పలికింది.

- ఈ ప్రైవేటీకరణ ప్రక్రియలో రెండు అంశాలు ప్రధానమైనవి....

  **i)** ప్రభుత్వరంగ సంస్థల యాజమాన్యాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవడం. దీన్నే డిస్ఇన్వెస్ట్‌మెంట్ (పెట్టుబడుల ఉపసంహరణ) అంటున్నారు.

  **ii)** ప్రభుత్వరంగ సంస్థలను పూర్తిగా విక్రయించడం.

- భారతదేశంలో ప్రైవేటీకరణ ద్వారా ప్రభుత్వరంగ సంస్థల పనితీరులో మార్పును సాధించడం, పన్ను చెల్లింపుదారుల ఆర్థిక భారాన్ని తగ్గించడం, సామాన్య ప్రజానీకానికి యాజమాన్య హక్కుల బదిలీ, ప్రైవేటు రంగంలో దేశీ, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.
- ప్రైవేటీకరణలో యాజమాన్య మార్పిడి - పూర్తి ప్రైవేటీకరణ, యాజమాన్యపు బదిలీ, ఉమ్మడి వ్యాపారం లాంటి వివిధ రూపాల్లో కనిపిస్తుంది.
- అలాగే ఉద్యమిత్వం (ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్) - విధాన నిర్ణయంలో స్వయం ప్రతిపత్తి, లీజింగ్, పునర్నిర్మాణం లాంటి రూపాల్లో కన్పిస్తుంది.

## ప్రైవేటీకరణ - పెట్టుబడుల ఉపసంహరణ

ప్రభుత్వరంగంలో అధిక మూలధనీకరణ, పనిలో నైతికత లేకపోవడం, అధిక వ్యయాలు, నవకల్పనల లోపం, సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోకపోవడం, విధాన నిర్ణయాల్లో ప్రభుత్వ జోక్యం పెరగడంతో వాటి పనితీరు దెబ్బతినడమే కాకుండా అధిక సంస్థలు ఖాయిలా దిశగా పయనించాయి.

- 1991 నూతన పారిశ్రామిక తీర్మానం ద్వారా ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణకు ఉపక్రమించారు.
- ప్రభుత్వరంగ సంస్థల ఈక్విటీలను మొత్తంగా గానీ లేదా పాక్షికంగా గానీ విక్రయించడాన్ని 'పెట్టుబడుల ఉపసంహరణ' అంటారు.
- మనదేశంలో 'ప్రైవేటీకరణ' అనే పదాన్ని ప్రత్యక్షంగా ప్రభుత్వం ఉపయోగించనప్పటికీ పెట్టుబడుల ఉపసంహరణ అనే ప్రక్రియ ద్వారా దాన్ని అమలు చేస్తోంది.
- 1990 - 91 నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా వివిధ బడ్జెట్లలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేదని చెప్పవచ్చు. 2016 - 17 కేంద్ర బడ్జెట్‌లో పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం రూ. 56,500 కోట్లుగా నిర్దేశించారు.
- ప్రభుత్వ అజమాయిషీ, నియంత్రణలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలు, ప్రధాన బ్లూచిప్ కంపెనీలైన ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, గెయిల్, వీఎస్ఎన్ఎల్ వాటాల విక్రయం ద్వారా ఆశించిన నిధులను సేకరించలేదు.
- 2005 నవంబరు 3 న జాతీయ పెట్టుబడి నిధిని ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడుల ఉపసంహరణ నిధులను ఆ నిధికి మళ్లిస్తున్నారు.
- 'జాతీయ పెట్టుబడి నిధి' నిధుల్లో కొంత శాతాన్ని ప్రభుత్వరంగ సంస్థల మూలధన పెట్టుబడికి, వాటి పునర్నిర్మాణానికి ఉపయోగించాలని పేర్కొన్నారు.

### ఆర్థిక ప్రయోజనాలు

ప్రైవేటు రంగం లాభార్జన ధ్యేయంతో నడవడం వల్ల యాజమాన్య సామర్థ్యాలు, మార్కెట్ నైపుణ్యాలు, నిర్వహణ, నాణ్యత మెరుగుపడతాయి.

- ప్రభుత్వ రంగంలోని బాధ్యతా రాహిత్యం ప్రైవేటు రంగంలో కనిపించదు.
- సమర్థులైన వ్యక్తుల చేతుల్లో బాధ్యతలను పెట్టడం వల్ల వారు బాధ్యతాయుతంగా వ్యవహర్తిస్తారు.
- ప్రైవేటు సంస్థలు తగిన కోశ క్రమశిక్షణను పాటిస్తాయి.
- ప్రభుత్వరంగ సంస్థల్లో ఉన్న రాజకీయ జోక్యం, ప్రైవేటు రంగంలో కనిపించదు.
- సంస్థ అభివృద్ధికి తగిన విధానపరమైన నిర్ణయాలను తక్షణమే తీసుకునే చొరవ ప్రైవేటు సంస్థల్లోనే సాధ్యం.
- వినియోగదారులకు మెరుగైన సేవలు, నాణ్యతను అందించడం ప్రైవేటు రంగంలోనే కనిపిస్తుంది.

**రచయిత: దాడి నారాయణరావు**



www.eenadupratibha.net